"గురువు గారి మౌనభాష నీకేమైనా అర్థం అయిందా?" అడిగారు మిగిలిన శిష్యులు.

అయిందన్నట్లుగా తల వూపాడు పుండరీకుడు.

"అయితే అది మాకూ చెప్పి పుణ్యం కట్టుకో." అర్థించారు సహ శిష్యులంతా.

"సర్వ సమర్థుడైన గురువుగారే బ్రహ్మాన్ని గూర్చి మాటల్లో చెప్పలేకపోయారే. ఇక నేనెలా చెప్పగలను? ఒక్క మౌనంలోనే అది బోధించగలం, అర్థం చేసుకోగలం." పుండరీకుడు చిన్నగా నవ్వి చెప్పాడు.

## 41. పాద నమస్కారం అంతరార్థం

హిందూమతం మీద ఆకర్షణ గల, అమెరికా నించి వచ్చిన ఓ సాధకుడు హిమాలయ పాదాల్లోని ఓ చోట తపస్సు చేసుకునే ఓ గొప్ప యోగి దగ్గరకి వెళ్ళాడు. అంతా ఆ యోగికి సాష్టాంగ నమస్కారాలు చేస్తూండటం గమనించిన ఆ అమెరికన్, తన వంతు రాగానే యోగిని అడిగాడు.

"స్వామీ! అంతా మీ పాదాలకి దేనికి నమస్కరిస్తున్నారు? దాని ప్రయోజనం ఏమిటో తెలీని నాకు దయచేసి అది చెప్పండి."

అందుకా యోగి చిరునవ్వు నవ్వి జవాబు చెప్పాడు.

"మన తల అహంకారాన్ని సూచిస్తుంది. అహంకారంగా ప్రవర్తించే వాడిని వీడికి 'తలబిరుసెక్కింది' అని మా భాషలో అంటాం. మీ భాషలో కూడా అహంకారిని 'హెడ్‌స్ట్రాంగ్ ఫెలో' అంటారు కదా. ఆ తలని ఓ జ్ఞాని పాదాల మీద వుంచడం అంటే మనలోని 'నేను' అనే అహంకారాన్ని ఆయనకి సమర్పిస్తున్నామని అర్థం. 'ఈ అహంకారం మీ పాదధూళికి కూడా సమానమైంది కాదు. దాన్ని దయతో స్వీకరించి నన్ను వుద్ధరించండి' అన్న భావాన్ని ప్రదర్శించడమే పాద నమస్కారం అంతరార్థం. ఆ అహంకారం నశిస్తే కాని జ్ఞానోదయం కలగదు."

వెంటనే ఆ అమెరికన్ సాధకుడు ఆ యోగికి సాష్టాంగ నమస్కారం చేసి తన తలని ఆయన పాదద్వయం మీద వుంచాడు.

## 42. నేను

రోడ్డు పక్క చెత్తడబ్బాకి ఆనుకుని కూర్చున్న అర్ధనగ్నంగా వున్న ఓ జ్ఞానితో తగూ పడ్డాడో అజ్ఞాని.

"నేనెవరో నీకు తెలుసా?" గర్జించాడు అజ్ఞాని.

చిన్నగా నవ్వి ప్రేమగా చూస్తూ అడిగాడు జ్ఞాని.

"ఆ 'నేను' ఎవరు బాబు? నీ పదవా? నీ ఆస్తా? నీ మనుషులా? నీ పరపతా? నీ విద్యా? లేక ఇంకేమైనానా? వాటిని మనసులో పెట్టుకునేనా నువు 'నేనెవరో నీకు తెలుసా?' అని నన్ను అడుగుతున్నావు? ఇలా ఎన్నో బయటి వాటిమీద స్వతంత్రం లేని ఆ 'నేను' ఆధారపడి వుంది. అవి దూరమైతే అప్పుడా నేను ఎంతో బలహీనమయి పోతుంది అని నువ్వు ఎన్నడూ ఆలోచించలేదా? కనీసం తనకి తానుగా నిలబడలేని ఆ 'నేను'ని చూసి ఎందుకు అలా మిడిసి పడుతున్నావు? ఆ నేనుని నువ్వు నాశనం చెయ్యి. అప్పుడు ఎన్నటికీ నాశనం కాని, ఇంతదాకా కలలో కూడా నీకు పరిచయం కాని సహజమైన ఆ 'అసలు నేను' నీ స్వంతమవుతుంది. అప్పుడు నీకు పరాయివాళ్ళ మీద ఇలా కోపం రమ్మన్నా రాదు. ఆనందం పొమ్మన్నా పోదు. అనేకంచేత నిర్మితమైన, నువ్వు పట్టుకుని వేలాడే ఆ 'నేను' ఎందుకూ కొరగానిదని అర్ధం చేసుకో."

అజ్ఞానికి తన అజ్ఞానం కొంత అర్ధమైంది.

## 43. నిశ్శబ్ద బోధ

ఓ హరిదాసు నిత్యం నిర్వహించే హరిభజనకి ఓ భక్తుడు అకస్మాత్తుగా రావడం మానేసాడు. అది గమనించిన హరిదాసు కొద్ది రోజులు వేచి చూసి తర్వాత ఆ భక్తుడి ఇంటికి వెళ్ళాడు. ఆ భక్తుడు హరిదాసుని సాదరంగా